క్లుప్తంగా

పిల్లల పెరుగుదలపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): పిల్లల పెరుగుదలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని సమావేశ మందిరంలో కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, తిరుపతి, రాయచోటి జిల్లాల నుంచి వచ్చిన వైద్యాధికారులకు క్లబ్‌ఫుట్(వంకర పాదాలు)పై కేర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ వారు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ పిల్లలు నడుస్తున్నప్పుడు ఇబ్బంది పడటం, తరచూ పడిపోవడం, పరిగెత్తడంలో ఇబ్బంది పడుతుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. చిన్నపిల్లల్లో వచ్చే సమస్యలపై చాలా మంది తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం వల్ల వాటిని ఆలస్యంగా గుర్తిస్తారన్నారు. చికిత్సలో జాప్యం వల్ల పిల్లలు విలువైన బాల్యాన్ని ఆనందంగా గడపలేకపోతున్నారన్నారు. పుట్టుకతో వచ్చే ఈ సమస్యలను త్వరగా గుర్తిస్తే సర్జరీతో గానీ, సర్జరీ లేకుండా గాని తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే సమన్వయ కర్త డాక్టర్ శైలేష్‌కుమార్, డాక్టర్ అభిషేక్ భాస్మే, డీఈఐసీ మేనేజర్ ఇర్ఫాన్, కేర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్గత బదిలీలు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కలిగించారు. మార్పులు, చేర్పులు చేస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 7వ డివిజన్‌లో పనిచేసే యువరాజ్‌ను 8వ డివిజన్‌కు,అక్కడ పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను 7వ డివిజన్‌కు బదిలీ చేశారు. 15వ డివిజన్‌లో పనిచేసే ఆంజనేయులును 14వ డివిజన్‌కు, 14వ డివిజన్‌లో పనిచేసే ఎం.శ్రీనివాసులును 15వ డివిజన్‌కు బదిలీ చేశారు.

దళిత ఉద్యోగులకు అండగా మేడ్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగులకు మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) అండగా నిలుస్తోందని మేడ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మేడ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ జన్మదినం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మేడ్ కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మేడ్ శాఖలు ఏర్పాటయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెన్నమ్మ, ప్రత్యూష, సంజీవ్, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన కిశోర్, అజయ్‌కుమార్, మహేష్ బాబు, రమేష్‌లకు జైలు శిక్ష విధిస్తూ బుధవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారి వాహనాలను సీజ్ చేసి మందు బాబులను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పగా వారిని కర్నూలు మండలం పంచలింగాల శివారులోని జిల్లా జైలులో అప్పగించినట్లు డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

'పది సప్లిమెంటరీ' మూల్యాంకనం పూర్తి

కర్నూలు సిటీ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం బుధవారంతో పూర్తి అయినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు 25 వేల సమాధాన పత్రాలు వచ్చాయని, రెండు రోజుల్లోనే 600 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను ఏర్పాటు చేసి విజయవంతంగా మూల్యాంకనాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు.

ప్రాణదాతలు కండి

కర్నూలు (న్యూసిటీ): ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎ.ఆనందరావు సూచించారు. బుధవారం జాతీయ సేవా సమితి, కర్నూలు తలసేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వీసీ మాట్లాడారు. తలసేమియా పిల్లలు, రోడ్డుప్రమాద బాధితులు, గర్భిణులు ప్రతిరోజు రక్తం అవసరమై అవస్థలు పడుతుంటారన్నారు. అలాంటి వారికి మనం ఇచ్చే రక్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన 34 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ భరత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కేవీ.రత్నం, డాక్టర్ అరుణ, డాక్టర్ నాగచంద్రుడు, తలసేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ సురేష్, అక్షయ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనేది కొండంత.. చూపేది గోరంత

- జీవనధార మందుల దుకాణాల్లో అక్రమాలు
- పెద్దాసుపత్రి ఖజానాకు రాని ఆదాయం
- గడువు తీరినా ఖాళీ చేయని వైనం
- ఆసుపత్రి అధికారుల పాత్రపై అనుమానం

రోగులకు తక్కువ ధరలకు మందులను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అద్దె తీసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల దుకాణాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించింది. లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న సంస్థలు దుకాణం ఏర్పాటు నుంచి అక్రమాలకు తెరతీశాయి. కొండంత కొని గోరంత కొనుగోలు చేసి విక్రయించామని, బెత్తెడు లాభాలు చూపి ఆసుపత్రి ఆదాయానికి భారీగా గండికొడుతున్నాయి. రెండేళ్లకు దుకాణం తీసుకుని 8 ఏళ్లు దాటినా అవే సంస్థలు కొనసాగిస్తున్నాయి. ఈ విషయం తెలిసి అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు దుకాణాలు ఖాళీ చేయాలని ఆదేశించినా ససేమిరా అంటున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న ప్రైవేటు మెడికల్‌షాపుల ద్వారా పదేళ్ల క్రితం ప్రతి నెలా రూ.2 లక్షలకు పైగా ఆదాయం వచ్చేది. అంతటి ఆదాయాన్ని వదిలేసి రోగులకు మంచి జరగాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రైవేట్ మందుల దుకాణాల స్థానంలో స్వచ్ఛంద సంస్థలు, మహిళా మండళ్ల ఆధ్వర్యంలో నిర్వహించే జనరిక్ మందుల దుకాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆసుపత్రిలో మూడు దుకాణాలు కేటాయించారు. ఓపీ బ్లాక్ వద్ద ఉన్న దుకాణాన్ని 2013 మే 1న స్త్రీశక్తి పట్టణ మహిళా సమాఖ్యకు, పాత చిన్నపిల్లల విభాగం వద్ద 2015 అక్టోబర్ 12న లిటిల్ రోజెస్ పట్టణ మహిళా సమాఖ్యకు, సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ వద్ద 2019 ఏప్రిల్ 16న సన ఎడ్యుకేషనల్ సొసైటీకి అప్పగించారు. మొదటి దుకాణం 2015 మే 31, రెండో దుకాణం 2016 అక్టోబర్ 11న, మూడో దుకాణం 2019 ఏప్రిల్ 15న గడువు తీరిపోయింది. కానీ ఇప్పటి వరకు అధికారులు వాటిని ఇతరులకు అప్పగించడం గానీ, స్వాధీనం చేసుకోవడం గానీ చేయలేదు.

పంచేది తూతూ మంత్రం..

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీవనధార మందుల దుకాణాల ద్వారా వచ్చిన ఆదాయంలో నిర్వాహకులు, ప్రభుత్వ ఆసుపత్రి సగం సగం పంచుకోవాలి. కానీ ఆయా సంస్థలు ఆసుపత్రికి మూడు నెలలకు, కొన్నిసార్లు ఆరు నెలలకు ఒకసారి లాభంలో వాటా పంచుతున్నారు. అది కూడా ప్రస్తుతం అరకొరగా మూడు నెలలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఇస్తున్నారు. ఇటీవల మార్చిలో ఒక నెలకు రూ.10,358 మాత్రమే ఇచ్చారు. కరోనా పేరుతో 2020 జూన్ నుంచి 2021 డిసెంబర్ వరకు ఆదాయం పంచలేదు. ఆ తర్వాత వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని లాభాలు తక్కువగా చూపుతూ వస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా రూ.లక్షల్లో మందులు కొనుగోలు చేస్తూ అందులో కేవలం 10 నుంచి 20 శాతం కొనుగోలు చేసినట్లు అధికారులకు చూపుతున్నట్లు ఆరోపణలున్నాయి.



ఆసుపత్రిలోని జీవనధార మందుల దుకాణం

ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చాం



ఆసుపత్రిలోని జీవనధార దుకాణాలు నిర్వహిస్తున్న పాత ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశాం. నాలుగు నెలల క్రితమే హెచ్‌డీఎస్ కమిటీ తీర్మానం మేరకు వారిని ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అయినా వారు ఇప్పటి వరకు ఖాళీ చేయడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో వారిని ఖాళీ చేయించి కొత్త ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగిస్తాం.

– డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

జీవనధార దుకాణాల ఏజెన్సీలు రద్దు

ప్రస్తుతం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న జీవనధార దుకాణాల ఏజెన్సీలను జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నాలుగు నెలల క్రితమే రద్దు చేసింది. వాటి స్థానంలో కొత్త ఏజెన్సీలకు ఆయా దుకాణాలను కేటాయించింది. ప్రస్తుత సంస్థలకు దుకాణాలు ఖాళీ చేయాలని నోటీసులు కూడా అధికారులు జారీ చేశారు. కానీ ఇప్పటి వరకు పాత యజమానులు దుకాణాలు ఖాళీ చేయకుండా ససేమిరా అంటున్నారు. ఆసుపత్రి అధికారులు ఖాళీ చేయాలని చెప్పడానికి వెళితే తాము మెప్మా పరిధిలో ఉన్నామని, తమకు వారు చెప్పాలని వెనక్కి పంపిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఆడిట్ అంతంతమాత్రం

ఆసుపత్రిలోని జీవనధార దుకాణయజమానులు నిర్వహిస్తున్న వ్యాపారంపై ఆసుపత్రి అధికారులు ఆడిట్ నిర్వహించి లాభాల లెక్కలు తీయాలి. కానీ ఆసుపత్రిలోని కొందరు అధికారులు తూతూ మంత్రంగా ఆడిట్ చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ కారణంగానే ఆయా దుకాణ యజమానులు తమకు నష్టాలు వస్తున్నాయని అధికారులకు చెబుతూ లాభాలు ఎగ్గొడుతున్నట్లు ఆరోపణలున్నాయి. వాస్తవంగా ఇందులో జనరిక్ మందులను మాత్రమే విక్రయించాలి. కానీ ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మందులను సైతం విక్రయిస్తున్నారు. ఈ మందులు స్థానిక ఏజెన్సీల వద్ద చాలా తక్కువకు లభిస్తాయి. వాటిపై 60 నుంచి 80 శాతం లాభాలు యజమానులకు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి మందులను కొనుగోలు చేసి రోగులకు విక్రయిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి మూడు, ఆరు నెలలకోసారి ఎంతో కొంత మొత్తాన్ని చెక్కుల రూపంలో ఆసుపత్రి ఖజానాకు చెల్లించి వెళ్తున్నా దానిపై అధికారులు కిమ్మనకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించండి

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లోని తన కార్యాలయంలో 15, 16, 17 వార్డుల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల బతుకులను మార్చేందుకు ఎన్నో పథకాలు తెచ్చి అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు గతంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ పథకాలను వివరించేందుకు కార్యకర్తలు ముందుండాలన్నారు.

డీవీఎంసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): డీవీఎంసీ(డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ) సమావేశాన్ని వెంటనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీవీఎంసీ కమిటీ సభ్యులు సాయిప్రదీప్, నవీన్‌కుమార్ కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కోరారు. బుధవారం వారు కలెక్టర్‌ను ఆమె చాంబరులో కలసి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలోనే డీవీఎంసీ సమావేశాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సభ్యులు సత్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

18న క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (రూరల్): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో అండర్-16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవేంద్ర గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9959251047 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాల నివారణకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన. చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, సెబ్ అదనపు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తోపాటు సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి మత్తు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి చికిత్స, కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ మామూలు స్థితికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో పార్సల్ సర్వీసుల ద్వారా కూడా రవాణా చేసే అవకాశం ఉండడంతో వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల్లో మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలను సూచిస్తూ బ్యానర్లు, పోస్టర్లను అతికించాలన్నారు. వైట్నర్‌ను ఇష్టానుసారంగా అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణాకు సంబంధించి కౌంటర్ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్వో నాగేశ్వరరావు, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు హరిప్రసాదు, మోహన్‌దాసు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య, అసిస్టెంట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, డీటీసీ శ్రీధర్, ఆర్టీసీ ఆర్ఎం రామం, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

హెచ్‌బీ పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): కిశోరబాలికలకు, గర్భిణులకు తప్పనిసరిగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని, వారికి రక్తం తక్కువగా ఉంటే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఉద్యోగనగర్, శారదనగర్, రామచంద్రనగర్‌లలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేసి రికార్డులు, వ్యాక్సిన్‌లు నిల్వ ఉంచే శీతలీకరణ పరికరాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్, డిస్ట్రిక్ట్ ఇమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



రామచంద్ర నగర్‌లో గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

రక్తదానానికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం ఆధ్వర్యంలో రక్తదాతలు, యువజన సంఘాల ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి రాయలసీమ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పేదలు వస్తారని, అలాంటి వారికి రక్తదానం చేయడానికి రక్తదాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలాంటి వారికి సన్మానం చేయడం తమ బాధ్యత అన్నారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ ఏపీసాక్స్ ఆదేశాలతో జిల్లాలో ఈ రోజు అన్ని ప్రాంతాల్లో రక్తదాతలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంత, డీపీఎం అలీహైదర్ పాల్గొన్నారు.

పేదల బతుకులు మార్చిన సీఎం

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



స్థానికులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలు తెచ్చి పేదల బతుకులు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంగారుపేట ప్రాంతాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకులు మారాలంటే సంక్షేమ రాజ్యం తేవాలని సంకల్పించిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆచరణలోకి తెచ్చారన్నారు. పారదర్శకంగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(రూరల్): నగరంలోని ఔట్‌డోర్ స్టేడియం చీఫ్ కోచ్‌గా శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నటరాజన్ పదవీ విరమణ పొందడంతో నెల్లూరులో పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా క్రీడాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

సదుపాయాలు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఈద్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్లు బుధవారం మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 29న బక్రీదు పండగ ఉందని, ఈద్ నమాజ్ కోసం ముస్లింలకు తగిన ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్లు జుబేర్, యూనుస్, ఫరాజ్, నయీం కోరారు. స్పందించిన మేయర్, ఎమ్మెల్యే మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

టీమ్ జగనన్న సర్టిఫికెట్ అందజేత

పార్టీలో కీలకంగా పనిచేస్తున్న కార్యకర్తలకు టీమ్ జగనన్న సర్టిఫికెట్లు అందజేశారు. బుధవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అందించారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎస్పీ అభినందనలు



సైనిక్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

కర్నూలు: సైనిక్ పాఠశాలకు ఎంపికైన 17 మంది విద్యార్థులను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా నుంచి దేశంలోని మహారాష్ట్ర, ఒరిస్సా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, గుజరాత్, కర్ణాటక సైనిక్ పాఠశాలలకు విద్యార్థులు విస్మయినాథ్, కార్తికేయ, శౌర్య, భవాని శంకర్, కేతన్, దైవక్, అఖిల్, వికాస్, సాయి వెంకట్, వివేక్, వెంకటసాయి చరణ్, ప్రణీత్‌జడల వివేక్, దీపక్, అజంత్, రిషిక్, మైత్రి తదితరులు ఎంపికయ్యారు. సైనిక పాఠశాలకు విద్యార్థులు ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన కర్నూలు ఎస్‌హెచ్‌ఎస్ సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఎస్పీ అభినందించారు. సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరి తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎండల నుంచి రక్షించుకునే జాగ్రత్తలు పాటించండి

- ట్రాఫిక్ పోలీసులకు ఏఎస్పీ సూచన




ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లను అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, సత్యసాయి ప్రసాద్


కర్నూలు: ఎండల తీవ్రత నుంచి రక్షించుకునేలా ట్రాఫిక్ పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ సూచించారు.బుధవారం రాజ్‌విహార్ సర్కిల్‌లో 30 మంది ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లను పంపిణీ చేశారు. సాయి రాయలసీమ పేపర్‌మిల్స్, హైదరాబాదు ఓజోన్ హాస్పిటల్స్ చైర్మన్ సత్యసాయి ప్రసాద్‌తో కలిసి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ ఏసీ హెల్మెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, ఎస్ఐ గిరిబాబు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలే విక్రయించాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాల్లో ప్రభుత్వం ప్రచురించిన పాఠ్యపుస్తకాలను మాత్రమే విక్రయించాలని, ఇతర ప్రచురణలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీఈఓ డాక్టర్ రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం జోన్ల వారీగా ధరలను నిర్ణయించిందని, ఈ మేరకు పుస్తకాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ నెల 17వ తేదీలోపు పుస్తకాల కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర పుస్తకాలను విక్రయిస్తే స్కూల్ గుర్తింపు రద్దు చేస్తామని పేర్కొన్నారు.



నీట్ ర్యాంకర్లతో శ్రీచైతన్య విద్యాసంస్థల డీన్స్ సరళ, బాలాజీ



నీట్ ర్యాంకర్లతో నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ లింగేశ్వర్ రెడ్డి

ఏపీ ఈఏపీ సెట్‌లో 'శ్రీచైతన్య' సత్తా

కర్నూలు సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(అనంతపురం), ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యా సంస్థల ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. బుధవారం కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జి.అలేఖ్య 246వ ర్యాంకు, వై.నాగచంద్రిక 973, సీహెచ్ లిఖితాంబిక 1,355, ఎమ్.విశాల్ హృదయ్ 1,519వ ర్యాంకుతో పాటు వెయ్యిలోపు ఇద్దరు, 2 వేలలోపు 9 మంది, 5 వేలలోపు 45 మంది, 10 వేలలోపు 102 మంది ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ డీన్స్ సరళ, బాలాజీ, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీల కోర్ డీన్ పి.లింగేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్, ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో పి.పంకజాక్షి 160వ ర్యాంకు సాధించారన్నారు. 200 లోపు ముగ్గురు, 500 లోపు 15 మంది, 1000 లోపు 34 మంది, 2000 లోపు 82 మంది, 5000 లోపు 164 మంది, 10 వేలలోపు 291 మందికి ర్యాంకులు వచ్చాయన్నారు. ఇంజినీరింగ్‌లో జె.పవన్‌కుమార్ రెడ్డి 684, వెంకటసాయి శ్రీసాహితి 889, ఆర్.నిహారిక 989వ ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ డీన్స్ విశ్వనాథరెడ్డి, ఆంజనేయరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యానేరం

కర్నూలు(హాస్పిటల్): స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం డీఐఓ కార్యాలయంలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ గురించి వివరించారు. సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్స్‌లో గర్భస్థ లింగనిర్ధారణ గురించి ఎవరికీ మాటలు, చేతుల, సైగల రూపంలో చెప్పకూడదన్నారు. గర్భిణి స్కానింగ్‌కు వచ్చినప్పుడు లింగనిర్ధారణ చెబితే మొదటిసారి మూడు నెలలు జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా, రెండో సారి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న వారిని ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి వారి పత్రాలు పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. డివిజన్‌లో ఉన్న జూనియర్ కళాశాల, నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో గైనకాలజిస్టు డాక్టర్ నర్మద, పీడియాట్రిస్ట్ డాక్టర్ ప్రకాష్ ఆనంద్, ఏపీపీ సుబ్బయ్య, డెమో శ్రీనివాసులుశెట్టి, ఎన్‌జీఓ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.